187వ అధ్యాయం

# ١٨٧ ـ بَابُ فَضْلِ الصَّلَوَاتِ

# నమాజుల ఘనత

قَالَ اللهُ تَعَالَى: ﴿إِنَّ ٱلصَّلَوٰةَ تَنْهَىٰ عَنِ ٱلْفَحْشَآءِ وَٱلْمُنكَرِ﴾[العنكبوت: ٤٥].

దివ్యఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చాడు:
"నిశ్చయంగా నమాజు అశ్లీల కార్యాల నుండి, చెడు పనుల నుండి నిరోధిస్తుంది."
*(అల్ అన్‌కబూత్: 45)*

## వివరణ

నమాజును తగురీతిలో, దైవప్రవక్త విధానానికి అనుగుణంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నెరవేర్చేవారికి మాత్రమే ఆ ప్రయోజనం లభిస్తుంది. అలాగాకుండా కాకి పొడుపులు పొడిచి నట్లు, ఏదో మొక్కుబడిగా చేసే నమాజు అసలు నమాజే కాదు. దాని వల్ల మనిషిలో ఎలాంటి మార్పూ రాదు. అందుకే నమాజ్‌ను పూర్తి భక్తిశ్రద్ధలతో నెరవేర్చాలి.

١٠٤٢ ـ وَعَنْ أَبِي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «أَرَأَيْتُمْ لَوْ أَنَّ نَهراً بِبَابِ أَحَدِكم يَغْتَسِلُ مِنه كُلَّ يَوْمٍ خَمْسَ مَرَّاتٍ، هَلْ يَبْقى مِنْ دَرَنِهِ شَيْءٌ؟» قَالُوا: لا يَبْقَى مِنْ دَرَنِهِ شَيْءٌ؛ قَالَ: «فَذٰلِكَ مَثَلُ الصَّلَوَاتِ الخَمْسِ، يَمْحُو اللهُ بِهِنَّ الخَطَايَا» متفقٌ عليه.

1042. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా (రజి) తెలియజేశారు: మీలో ఎవరి ఇంటి ముందైనా ఒక సెలయేరు ఉండి, అందులో అతను ప్రతి రోజూ ఐదుసార్లు స్నానం చేస్తూ ఉంటే అతని ఒంటిపై మురికి, మాలిన్యాలు మిగిలి ఉంటాయా చెప్పండి?" అని అడిగారు దైవప్రవక్త (సల్లం). దానికి సహచరులు, "ఎలాంటి మురికి, మాలిన్యాలు మిగిలి ఉండవండీ?" అని సమాధానమిచ్చారు. అప్పుడు దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "ఐదుపూటల నమాజు సంగతి కూడా

అంతే. అల్లాహ్ వాటి మూలంగా పాపాలను మన్నిస్తాడు." (బుఖారీ-ముస్లిం)

(సహీహ్ బుఖారీలోని నమాజ్ ప్రకరణం- సహీహ్ ముస్లింలోని ప్రార్థనాస్థలాల ప్రకరణం)

## ముఖ్యాంశాలు

ఈ హదీసులో ఐదుపూటల నమాజ్ ఘనత, వాటిని నెరవేర్చటం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించబడ్డాయి. ప్రతి రోజూ ఐదుపూటల నమాజ్ చేస్తే మనిషి వల్ల జరిగే చిన్నచిన్న పాపాలన్నీ మన్నించబడతాయి. అయితే నియమనిబద్ధంగా, భక్తిశ్రద్ధలతో చేసే నమాజ్ వల్లే ఇలా జరుగుతుందన్న విషయాన్ని మర్చిపోకూడదు. తమకు నచ్చిన విధంగా, తమకిష్టం వచ్చినట్లు చేసే నమాజు వల్ల ఏ పాపం మన్నించబడదు.

1043. హజ్రత్ జాబిర్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఐదుపూటలా నమాజ్ చేయటం మీలో ఒకరి ఇంటిముందు నిండుగా ప్రవహిస్తున్న సెలయేటిలో, రోజూ ఐదుపూటల స్నానం చేయటం లాంటిది. (ముస్లిం)

١٠٤٣ ـ وَعَنْ جَابِرٍ رَضِيَ الله عَنْه قَالَ: قَالَ رَسُولُ الله ﷺ: «مَثَلُ الصَّلَوَاتِ الخَمْسِ كَمَثَلِ نَهْرٍ جَارٍ غَمْرٍ على بَابِ أَحَدِكُمْ يَغْتَسِلُ مِنْهُ كُلَّ يَوْمٍ خَمْسَ مَرَّاتٍ» رواه مسلم. «الغَمْرُ» بفتح الغين المعجمة: الكثير.

(సహీహ్ ముస్లింలోని ప్రార్థనా స్థలాల ప్రకరణం)

1044. హజ్రత్ ఇబ్నె మస్వూద్ (రజి) కథనం: ఒకతను ఓ స్త్రీని ముద్దాడాడు. ఆ తర్వాత అతను (పాపభీతితో) దైవప్రవక్త (సల్లం) దగ్గరికి వచ్చి తను చేసిన తప్పుని గురించి చెప్పుకున్నాడు. అప్పుడు "నమాజును స్థాపించు, పగటి యొక్క రెండు సరిహద్దు సమయాలలోనూ, కొంత రాత్రి గడచిన తరువాతనూ. నిస్సందేహంగా సత్కార్యాలు దుష్కార్యాలను దూరం చేస్తాయి" అనే ఆయతు అవతరించింది. ఆ తర్వాత

١٠٤٤ ـ وَعَنِ ابْنِ مَسْعُودٍ رَضِيَ اللهُ عَنْهُ أَنَّ رَجُلاً أَصَابَ مِن امْرَأَةٍ قُبْلَةً، فَأَتَى النَّبِيَّ ﷺ فَأَخْبَرَهُ فَأَنْزَلَ اللهُ تعالى: ﴿ وَأَقِمِ ٱلصَّلَوٰةَ طَرَفَيِ ٱلنَّهَارِ وَزُلَفًا مِّنَ ٱلَّيْلِ إِنَّ ٱلْحَسَنَٰتِ يُذْهِبْنَ ٱلسَّيِّـَٔاتِ ﴾ فقالَ الرَّجُلُ: أَلِيَ هذا؟ قال: «لِجَمِيعِ أُمَّتِي كلِّهِمْ» متفقٌ عليه.

అతను "ఈ ఆయతులోని ఆదేశం నా కొక్కడికేనా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (సల్లం) "నా అనుచర సమాజంలోని వారందరికీ" అని చెప్పారు.

(బుఖారీ-ముస్లిం)

## ముఖ్యాంశాలు

పగటి యొక్క రెండు సరిహద్దు సమయాలలో నమాజ్ స్థాపించటమంటే, ఫజ్ర్ మరియు మగ్రిబ్ నమాజులు కావచ్చు. కొంతమంది దానిభావం కేవలం ఇషా నమాజు అనీ, మరికొంతమంది మగ్రిబ్ మరియు ఇషా నమాజులని, "కొంతరాత్రి గడచిన తర్వాత" అంటే తహజ్జుద్ అనీ అభిప్రాయపడ్డారు. బహుశా ఈ ఆయతు మేరాజ్ సంఘటనకు ముందు అవతరించి ఉంటుందని ఇమామ్ ఇబ్నె కసీర్ (రహ్మాలై) తన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎందుకంటే మేరాజ్ సంఘటన జరిగినప్పుడే ఐదు నమాజులు విధించబడ్డాయి. అంతకు ముందు రెండు నమాజులే విధిగా ఉండేవి. ఒకటి- సూర్యోదయానికి ముందు, మరొకటి- సూర్యాస్తమయానికి ముందు. ఆ తర్వాత రాత్రి చివరి వేళల్లో తహజ్జుద్ నమాజ్ ఉండేది.

ఏది ఏమైనా ఇక్కడ ఈ ఆయతు ద్వారా, నమాజ్ అనేది చాలా గొప్ప సత్కార్యమన్న విషయం బోధపడుతోంది. నమాజ్ చేస్తే గతంలో జరిగిన పాపాలు సమసిపోతాయి. అయితే దానివల్ల చిన్నచిన్న పాపాలు మాత్రమే క్షమించబడతాయి. పెద్దపాపాలు క్షమించబడటానికి స్వచ్ఛమైన పశ్చాత్తాపం అవసరం.

١٠٤٥ ـ وعن أبي هُريرةَ رضيَ اللهُ عنهُ أنَّ رسولَ الله ﷺ قال: «الصَّلَواتُ الخَمسُ، وَالجُمُعَةُ إلى الجُمُعَةِ، كفَّارَةٌ لِمَا بَيْنَهُنَّ، مَا لَمْ تُغشَ الكَبَائِرُ» رواه مسلم.

1045. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: ఘోరపాపాలకు పాల్పడకుండా ఉంటే ఐదు పూటల నమాజులు, ఒక జుమా నుండి మరో జుమా వరకు గల కాలం, వాటి మధ్య జరిగే (చిన్నచిన్న) పాపాలకు పరిహారాలు. (ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని శుచీశుభ్రతల ప్రకరణం)

## ముఖ్యాంశాలు

ఐదుపూటల నమాజుల విరామ సమయంలో, ఒక జుమా నుండి మరో జుమాకు గల మధ్యకాలంలో జరిగే పాపాలన్నీ మన్నించబడతాయని పై హదీసు ద్వారా బోధపడుతోంది.

అయితే ఘోరపాపాలకు పాల్పడి ఉండకూడదు. ఎందుకంటే ఘోరపాపాలు మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందనంతవరకు క్షమించబడవు. బహుదైవారాధన, తల్లిదండ్రుల పట్ల అవిధేయత, అబద్ధ ప్రమాణాలు, అబద్ధపు సాక్ష్యాలు, అనాథుల సొమ్ము తినటం, శీలవతుల మీద నిందలు మోపటం మొదలగునవన్నీ ఘోరపాపాలు. ఇవి కేవలం నమాజ్ చేసినంత మాత్రాన క్షమార్హం కావు.

١٠٤٦ ـ وعن عثمانَ بنِ عفانَ رضيَ اللهُ عنهُ قالَ: سَمِعْتُ رسولَ اللهِ ﷺ يقولُ: «مَا مِن امرِىءٍ مُسْلِمٍ تَحْضُرُهُ صَلاةٌ مَكْتُوبَةٌ فَيُحْسِنُ وُضُوءَهَا، وَخُشُوعَهَا، وَرُكوعَها، إلَّا كانت كَفَّارَةً لِمَا قَبْلَهَا مِنَ الذُّنُوبِ ما لمْ تُؤتَ كَبيرَةٌ، وَذلكَ الدَّهْرَ كُلَّهُ» رواه مسلم.

1046. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి) తెలియజేశారు: ఏ ముస్లిం అయినా ఫర్జ్ నమాజ్ వేళ కాగానే చక్కగా వుజూ చేసి, ఎంతో భక్తితో, ఉత్తమ పద్ధతిలో రుకూ చేస్తే, అది అతని వెనుకటి పాపాలకు పరిహారం అవుతుంది. అయితే అతను ఘోరపాపానికి ఒడిగట్టి ఉండకూడదు. ఈ పరంపర నిత్యం కొనసాగుతూనే ఉంటుంది. (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని శుచీశుభ్రతల ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

నమాజును - దాని నియమాలను, విధులను పాటిస్తూ నెరవేర్చాలని ఈ హదీసులో బోధించబడింది. అలాంటి నమాజే పాపాలకు పరిహారం కాగలుగుతుంది. లేకపోతే దానివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు.